

మంగళవారం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జి.చిన్నారెడ్డి

## సిఎం ప్రజావాణిలో 379 దరఖాస్తులు

**హైదరాబాద్ (బేగంపేట), మే 5,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన 219వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 379 దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 103 దరఖాస్తులు, రెవెన్యూశాఖకు సంబంధించి 66 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 105 దరఖాస్తులు, ప్రవాసీప్రజావాణీకి 2దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 103దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణీ ఇంచార్జ్ ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్ సూర్యప్రకాష్,ఏసీపీ ఉమేందర్, ప్రవాసీ ప్రజావాణీ సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 11 నుంచి పిఎంశ్రీ స్కూల్స్‌లో సమ్మర్ క్యాంప్‌లు

### పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే5:** రాష్ట్రంలో కొనసాగుతున్న పీఎంశ్రీ పాఠశాలల్లో వేసవి శిబిరాలను(సమ్మర్ క్యాంప్) నిర్వహించాలని పాఠశాల విద్యశాఖ నిర్ణయించింది. ఈ నెల 11 నుంచి 25 రాష్ట్రంలో కొనసాగుతున్న 533 పీఎంశ్రీ స్కూల్స్ లో సమ్మర్ క్యాంప్‌లను కొనసాగించాలని పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ సంవత్సరం కూడా ఈ నెల 11 నుండి 25 మే వరకు పీఎంశ్రీ పాఠశాలల్లో వేసవి శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్రంలోని జిల్లా విద్యాధికారులందరికీ తెలియజేశారు. సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించడానికి రూ. 2,66,50,000లను మంజూరు చేశారు. వేసవి శిబిరాల్లో పీఎంశ్రీ పాఠశాలలయేతర విద్యార్థులు కూడా చేరవచ్చని డైరక్టర్ సూచించారు. జిల్లా విద్యా అధికారులు (డీఈవో) అందరూ వేసవి శిబిరాల నిర్వహణ కోసం సంబంధిత ప్రధానోపాధ్యాయులకు బడ్జెట్‌ను విడుదల చేయాలని, ప్రతి శిబిరానికి సెక్టోరల్ అధికారులు, ఎంఈవోలను నియమించి, ప్రతిరోజూ క్రమం తప్పకుండా పర్యవేక్షి స్తూ, శిబిరాల సరైన అమలును పర్య వేక్షించి నివేదికను సమర్పించాలని

## సిపిఎస్‌పై ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలి

### తమిళనాడు, కేరళ ఎన్నికల తీర్పే దిక్సూచి


### ప్రభుత్వానికి టిఎస్‌సీపీఎస్ఈయూ డిమాండ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే5:** సిపీఎస్ రద్దుపై తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సీపీఎస్ ఈయూ) డిమాండ్ చేసింది.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ ఉద్యోగుల ఆవేదనను, వారి సామాజిక భద్రతకు ఉన్న ప్రాముఖ్యతను చాటి చెప్పాయని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ అన్నారు. సోమవారం వెలు వడిన ఫలితాల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ, కేరళ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్)సాధించిన అద్భుత విజయం వెనుక ఆ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన 'సిపీఎస్ రద్దు పాత పెన్షన్ పునరుద్ధరణ' హామీ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ తమిళనాడు వ్యాప్తంగా సుమారు 110 నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో టీవీకే అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యం కనబరిచారని, ముఖ్యంగా 10 వేల లోపు ఓట్ల మెజారిటీతో ఆ పార్టీ గెలుపొందిన 15 నుండి 20 నియోజకవర్గాల్లో, 5 వేల లోపు ఓట్ల మెజారిటీతో 4, 2వేల రెండు వేల లోపు మెజారితో ఐదింటిలో, కేరళలో దాదాపు 18 నియోజకవర్గాల్లో 5000 లోపు ఓట్ల మెజారిటీతో ఉద్యోగుల పోస్టల్ ఓట్లే .. గెలుపు గుర్రాలుగా నిలిచాయన్నారు. తమిళనాడు మాజీ సీఎం ఎంకె స్టాలిన్ నియోజకవర్గం కొలత్తూరు వంటి కీలక స్థానాల్లో కూడా ప్రభుత్వ ఉద్యోగులు మార్పు వైపు మొగ్గ చూపారన్నారు. ఇది ఒక పార్టీ విజయం కాదని, తమ వృద్ధాప్య భద్రత కోసం ఉద్యోగులు ఇచ్చిన తీర్పని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్న పాత పెన్షన్ విధానాన్ని గమనించి, ప్రభుత్వాలు ఉద్యోగుల ఆవేదనలను నిరక్ష్యం చేయకుండా, తక్షణమే సిపీఎస్ రద్దుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఇంటర్ అడ్మిషన్ తాత్కాలిక నిలుపుదల

### సవరించిన షెడ్యూల్ త్వరలోనే జారీ: బోర్డు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 5:** తెలంగాణ రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సోమవారం జారీ చేసిన ఇంటర్ అడ్మిషన్ షెడ్యూల్‌ను తాత్కాలికంగా నిలుపదల చేశారు. కొన్ని ప్రతిపాదిత సంస్కరణల దృష్ట్యా, ఈ సర్క్యులర్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన సూచనలతో త్వరలో అడ్మిషన్ షెడ్యూల్ జారీ చేయబడుతుందని ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో అడ్మిషన్లను ఈ నెల 8 నుంచి ప్రారంభించడానికి షెడ్యూల్‌ను సోమవారం జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 31 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు అడ్మిషన్ల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ సోమవారం విడుదల చేశారు. తరగతులను జూన్ 1నుంచి ప్రారంభించనున్నట్టు తెలిపారు. మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియను జూన్ 30నాటికి ముగించాలని సూచించారు. సోమవారం జారీ చేసిన షెడ్యూల్‌ను అభయన్స్‌లో పెట్టినట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ప్రిన్సిపాల్స్‌కి ఇంటర్ బోర్డు లేఖలు రాసింది.



మంగళవారం నిర్వహించిన ధర్నాలో అభివాదం చేస్తున్న బిపిటియంయం నేతలు

## హామీలను తక్షణమే అమలు చేయాలి

### బిపిటిఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 5, ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని బిపిటి యంయం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేసించి రవిశంకర్ మాట్లాడుతూ ప్రైవేట్ రవాణా కార్మికుల కొరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం వలన ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతిని, తమ కుటుంబాలను పోషించుకోలేక, ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లకు ఏటా 12వేలు ఇస్తామని చెప్పి, ఆటో లైసెన్స్‌లనే ఎత్తివేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.పెంటయ్యగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు జరగటం మొదటిసారని, అవి డ్రైవర్ల ఆత్మహత్యలు కాదని, ప్రభుత్వ హత్యలను ఆరోపించారు. తక్షణమే ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ సంఘాలను చర్చలకు పిలిచి, సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షం అన్ని సంఘాలను కలుపుకుని, రాష్ట్రంలో రవాణా బంద్ చేస్తామని హెచ్చరించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో బిపిటి యంయం ఉపాధ్యక్షులు గీతా సోనీ, టిఎస్‌పిటి యంయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.శ్రీధర్‌రెడ్డి, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చింతల నందకిషోర్, టిఎస్‌పిటియంయం రాష్ట్ర అధ్యక్షులు లిఖిత్‌కుమార్, ఉపాధ్యక్షులు హబీబ్, క్యాబ్ యూనియన్ నాయకులు సంతోష్, మీనా, గ్రేటర్ ఆటో యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అశ్విన్ రాజు, మినీ గూడ్స్ వెహికిల్ యూనియన్ నాయకులు, స్కూల్ వ్యాన్ డ్రైవర్స్ యూనియన్, స్కూల్ బస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం సిబిఐ విచారణపై స్పష్టత ఇవ్వాలి

### ప్రధాని మోడీని డిమాండ్ చేసిన పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

### కెసిఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదో బండి సంజయ్ చెప్పాలి




మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మహేష్ గౌడ్

**హైదరాబాద్,మే 5,ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ వచ్చే లోపు మే10 లోగా కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సిబిఐ విచారణ చేపడ తారా? లేదా? అనేది స్పష్టత ఇవ్వాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ మమతబెనర్జీ, కేజ్రీవాల్ మీద కేసులు పెట్టిన కేంద్ర ప్రభుత్వం కెసిఆర్ మీద ఎందుకు పెట్టడంలేదనీ ప్రశ్నించారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే విషయం మర్చిపోయి మాట్లాడుతున్నారనీ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేలకోట్ల అవినీతి జరిగిందని చెప్పాము దర్యాప్తు జరపాలని సిబిఐ విచారణ కోరుతూ సిబిఐ లేఖరాశాము అని ఆయన గుర్తుచేశారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ అవినీతి మేడిగడ్డ కుం గుబాటు, సుందిళ్ళ,అన్నారం బుంగులు పడటం పంపుహౌజ్‌లు ముంపుకు గురవడం వంటి అం శాలపై సిబిఐ విచారణ ఎందుకు చేయడం లేదో బండి సంజయ్ సమాధానం చెప్పాలనీ ఆయన ప్రశ్నించారు.ఎన్నికల ముందు కాళేశ్వరంలో అవినీతి జరిగిందని బిజెపి నేతలు చెప్పారనీ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక సిబిఐ విచారణ చేయడంలేదనీ వాపోయారు. కాళేశ్వరం విషయంలో కెసిఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో బండి సంజయ్ చెప్పాలనీ ఆయన డిమాండ్ చేశారు. తుపాకీ మాభుజాల మీద పెట్టి బిఆర్‌ఎస్‌ను కాల్చాలని బండి సంజయ్ చూస్తున్నారనీ విమర్శించారు. బిజెపి వాళ్ళు తలుచుకుంటే రేపటి నుంచి సిబిఐ విచారణ చేయవచ్చు కానీ చేయరు ఎందుకంటే ఇక్కడ వారి బలంతో లోక్ సభలో ఎనిమిది సీట్లు గెలుపొందారని ఆరోపించారు. బిఆర్‌ఎస్ నేతల మద్దతు లేకుండా బిజెపి కి రాష్ట్రంలో 8సీట్లు వచ్చేవా అనే సందేహం ఆయన వ్యక్తపరిచారు. అసెంబ్లీ ఎన్నికలలో సిరిసిల్ల నియోజకవర్గంలో బిజెపికి 18వేల ఓట్లు పోలైనాయనీ లోక్‌సభఎన్నికలలో కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని సిరిసిల్లలో 72వేల ఓట్లు ఎలా బిజెపికి పడ్డాయని ఆయన ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ మద్దతు లేకుండా బిజెపికి ఓట్లు పడ్డాయా అని అని అడిగారు. హరీష్ రావు మద్దతు లేకుండా మెదక్‌లో బిజెపి ఎంపి సీటు గెలిచారా అని ఆయన అనుమానం వ్యక్తంచేశారు. బిజెపి గెలుపు కోసం ప్రయత్నం చేశారు కాబట్టి మీపై కాళేశ్వరం సిబిఐ విచారణచేయడం లేదనీ మహేష్ అభిప్రాయపడ్డారు. వరి వేస్తే ఉరి అన్నది మీరే కదా ఇవ్వాలా మీరు రైతుల కోసం ఏదో చేస్తున్నట్లు మొసలి కన్నీరు కారుస్తున్నారనీ దుయ్యబట్టారు. మా ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందని, రైతుబంధు తరహాలో రైతు భరోసా ఇస్తున్నామని, అంతేకాదు సన్నాలకు క్వీం టాల్‌కు ఐదు వందల చొప్పున బోనస్ ఇస్తుందనీ అని వివరించారు. మా ప్రభుత్వం మక్కలుకూడా కొంటుందనీ రైతులు ఎంతో సంతోషంగా విక్రయించుకొంటున్నారని ఆయన తెలిపారు. బెంగాల్‌లో బిజెపికి అనుకూల పరిస్థితులు లేవనీ అది కేవలం ఓటుచోరితో గెలిచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రత్యేక ఓటర్ల సవరణతో బెంగాల్‌లో 90లక్షల ఓట్లను కేంద్రం లోని బిజెపి పాలకులు తొలగించారనీ ఆరోపించారు.తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, ఓటును కాపాడుకోవాలని సూచించారు.

# గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా ఉపాధి



### ప్రతిరోజు 15లక్షల మంది కూలీలకు పనులు కల్పిస్తాం

### రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షలో మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉపాధిహామీ పనుల్లో రోజుకు సుమారు 9 లక్షల మంది కూలీలు పాల్గొంటున్నారని, ఈ సంఖ్యను తక్షణం 15 లక్షలకు పెంచేలా సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని స్పష్టం చేశారు. అందుకు గ్రామాల్లో పనుల ప్రణాళికను వేగవంతం చేయడంతోపాటు అవసరమైన అనుమతులు, సాంకేతిక ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసి మరిన్ని పనిదినాలు కల్పించాలన్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సిఇఒలు, డిఆర్‌డిఒలు, డిపిఒలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, మిషన్ భగీరథ అధికారులతో మంత్రి సీతక్క మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, ఉపాదిహామి, సెర్ప్, ఇతర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను కేవలం అనుమతించిన పనులకే వినియోగించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లించిన ఘటనలపై సంబంధిత అధికారులు వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను అత్యవసరంగా చెల్లించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 1590కోట్ల మేర బకాయిలు ఉండటం ఆందోళనకరమని, వాటిని చెల్లించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామ పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఏప్రిల్, మే నెలకు కేంద్రం మంజూరు చేసిన 6 కోట్ల పని దినాల్లో, ఏప్రిల్‌లో కోటిన్నర పనిదినాలు సాధించడం సానుకూలమని, మే నెలలో పూర్తి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. పనితీరు తక్కువగా ఉన్న జనగామ, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, ఖమ్మం జిల్లాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. కూలీలకు వేతనాల చెల్లింపుల విషయంలో పురోగతి సాధించినట్లు మంత్రి తెలిపారు. కేంద్రంతో సమన్వయం చేసుకోవడం ద్వారా రూ.462 కోట్ల నిధులు విడుదల చేయించామని, ఏప్రిల్ 15 వరకు బకాయి చెల్లింపులు పూర్తయ్యాయని చెప్పారు. పని స్థలాల్లో తాగునీరు, షెడ్లు, ఫస్ట్ ఎయిడ్ వంటి కనీస సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. సెర్ప్ కార్యక్రమాల కింద మహిళా భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి జిల్లా మహిళా సమాఖ్య భవనాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సుమారు 5వేల గ్రామీణ మహిళా భవనాల పను లను త్వరితగతిన పూర్తి చేయాలని, అదేవిధంగా మహిళా సంఘాల కోసం నిర్మిస్తున్న 46 గోదాముల నిర్మాణాన్ని విస్తరించాలని పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 1,900 గ్రామ పంచాయతీ భవనాలు, 1450 అంగన్‌వాడి కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికా రులను ఆదేశించారు.ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మీ, మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఇఎన్‌సి జోగారెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కొనుగోళ్లలో రానున్న రెండువారాలు కీలకం

### వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలి

### క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పర్యటించాలి

### రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలు



**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్లలో వేగ పెంచాలని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవింద్ర ఆదేశించారు. ధాన్యం సేకరణ తక్కువగా ఉన్న కొనుగోలు కేంద్రాలపై ఆయా జిల్లాల ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు. రానున్న రెండు వారాలు యుద్ధ ప్రాతిపదికన పని చేసి ధాన్యం కొనుగోలును విజయవంతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ధాన్యం సేకరణలో భాగస్వాములైన ప్రతీ ఒక్క అధికారి, సిబ్బంది, మిల్లర్‌పై ఉందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలని, ధాన్యం అమ్మిన రైతులకు జాప్యం లేకుండా చెల్లింపులు చేయాలన్నారు. తూకం, రవాణా, హమాలి, మిల్లుల వద్ద అన్ లోడింగ్ ఈప్రక్రియలన్నీ వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు మంగళవారం నల్గొండ జిల్లాలో ధాన్యం సేకరణను పరిశీలించి వచ్చిన అనంతరం రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల సరళిపై ఆయన సమీక్షించి ఆదేశాలు జారి చేశారు. ధాన్యం సేకరణలో సమస్యలను గుర్తించి పరిష్కరించడంతోపాటు సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు, అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రైతులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు వడదెబ్బకు గురికాకుండా టెంట్లు, తాగునీరు, ఒఆర్ఎస్ పాకెట్లు ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వాహనాల కేటాయింపును ఎప్పటికప్పుడు సమకూర్చాలని, ప్రతీ రోజు వాహనాలను అవసరమున్న చోటుకు తరలించేలా రవాణాశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అదనపు వాహనాలను సిద్ధంగా ఉంచుకొని ఎక్కడ అవసరముంటే అక్కడకు పంపించాలని సూచించారు.ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి ధాన్యం సేకరణ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన టార్పాలిన్లు సమకూర్చిందని, అంతేకాకుండా మిల్లర్ల చార్జీలు కూడా చెల్లించిందని ఆయన స్పష్టం చేశారు. బాయిల్డ్ రైస్ టార్గెట్ అడ్వాన్స్‌గా ఇచ్చామని తెలిపారు. గన్ని బ్యాగుల కొరత లేకుండా 11 కోట్ల కొత్త గన్ని బ్యాగులు తీసుకొచ్చామని వివరించారు. ఈ నేపథ్యంలో మిల్లర్లు ధాన్యం సేకరణలో పూర్తి సహకారం అందించాలని, మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని నిర్దేశించారు

## 24, 25న తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర మహాసభలు

### ఆహ్వాన సంఘం ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ కోదండరామ్ ఎన్నిక

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 5:** తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలను ఈ నెల 24, 25 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. టిపిఎన్ఎం రాష్ట్ర మహా సభల ఆహ్వాన సంఘం ఛైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ గడిచిన గత చరిత్రలో నాటక, సినీ రంగాలలో స్థిరపడ్డ అనేకమంది కళాకారులు, నటులు, దర్శకులు తెలంగాణ ప్రజానాట్య మండలి నుండి ఎదిగినవారేనని తెలిపారు. భూస్వామ్య ఆధిపత్యాన్ని తట్టుకోలేక పోరాడిన కాలంలో వాళ్ల పోరాటానికి ప్రజానాట్యమండలి ఊపిరిని పోసిందన్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి సాంస్కృతిక ఉద్యమమే శరణ్యమని ఆనాడు ఆంధ్ర మహాసభ నిర్ణయం తీసుకున్నదన్నారు. అమెరికా లాంటి దేశాలు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని చూసిన తరుణంలో ఇరాన్‌పై ఇతర దేశాలపై అనేక దాడులను నిర్వహిస్తున్నారని, అలాంటి యుద్ధాల వలన అనేక సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారన్నారు. రాజకీయం అంటే కేవలం డబ్బు, మందు మయంగా మారిందని, ఇలాంటి దుర్భరమైన పరిస్థితులలో ప్రజల్లో సాంస్కృతిక ఉద్యమం మళ్ళీ అనివార్యంగా మారిందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, టిపిఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ఆఫీస్ బేరర్స్ కే. లక్ష్మీనారాయణ, కే. ఉప్పలయ్య, పడాల నళిని, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్ర మోహన్ గౌడ్, నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తివేసే కుట్రను మానుకోవాలి

### మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుంటాం, జూన్‌లో హైదరాబాద్ ముట్టడి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, విద్యార్థి సంఘాల హెచ్చరిక



**హైదరాబాద్, మే 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చి, దాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. గత 30 నెలలుగా బడ్జెట్ విడుదల చేయకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని నేతలు ఆరోపించారు. బడ్జెట్ కొరత అనేది కేవలం ఒక సాకు మాత్రమేనని, 6లక్షల కోట్ల ఆదాయం మరియు 3.60లక్షల కోట్ల అప్పులు తెచ్చిన ప్రభుత్వం, 14 లక్షల మంది విద్యార్థుల కోసం 8 వేల కోట్లు విడుదల చేయడానికి ఎందుకు వెనకాడుతోందని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు చెల్లిస్తున్న సర్కారుకు, పేద విద్యార్థుల చదువుపై పట్టింపు లేదని విమర్శించారు. జీవో నంబర్ 7 ద్వారా ఫీజులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో వేస్తామనడం పథకాన్ని అటకెక్కించే ప్రయత్నమేనని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వం బకాయిలతో తమకు సంబంధం లేదని కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం దారుణమని అన్నారు.ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు. మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనలను అడ్డుకోవడం, ఘెరావ్ చేయడం, జూన్ చివరి వారంలో 5 లక్షల మందితో హైదరాబాద్ ముట్టడి ఉంటుందని హెచ్చరించారు. అవసరమైతే జూలైలో సీఎం నివాసం ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. వెంటనే పాత బకాయిలను విడుదల చేసి, డీబీటీ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.

## బిఆర్ఎస్ అవినీతిపై సిబిఐ విచారణకు ముందుకు రాని బిజెపి

### రేవంత్‌రెడ్డి గేమ్ ఛేంజర్, ఆయన పాపులారిటీ పెరుగుతూనే ఉంటుంది

### కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,మే 5,ప్రభాతవార్త:** బిజెపికి అవయవ దానం చేసిన బిఆర్ఎస్ అవినీతిపై సిబిఐ విచారణకు బిజెపి ముందుకు రావడానికి జంకుతోందని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ మోడీ పర్యటన లోగా సిబిఐతో బిఆర్ఎస్ పాలనలో జరిగిన అనేక అవినీతి అంశాలను సిబిఐతో విచారణ జరిపిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు, భద్రాద్రి,యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాల్లో చోటు చేసుకున్న అవకతవకలపై జస్టిస్ మదన్ బీ లోకూర్ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సిబిఐ విచారణకు ఆదేశిస్తే ఎందుకు సిబిఐ విచారణ ప్రారంభించలేదనీ ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు బిజెపి ద్వంద్వ విధానం చూస్తున్నారనీ, సిబిఐ విచారణ కేంద్రం ఎందుకు చేయడం లేదో కూడా వారికి తెలుసని ఆయన అన్నారు.తెలంగాణలో బిజెపి 8 ఎంపిలు గెలవడంలో బిఆర్ఎస్ పాత్ర ఉందనీ ఆయన ఆరోపించారు. సిరిసిల్లలో అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థికి 18 వేల ఓట్లు వస్తే లోక్ సభ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్‌కు సిరిసిల్లలో 70 వేల ఓట్లు వచ్చాయనీ ఇదే వారి మధ్య ఉన్న సంబంధమని ఆయన ఆరోపించారు. బండి సంజయ్‌కి రేవంత్ రెడ్డిపై కోపం వున్నా,రేవంత్ రెడ్డి పాపులారిటీ పెంచుకోవద్దు అని ఉన్నా మాకు ఇబ్బంది ఏం లేదు రేవంత్ రెడ్డిగేమ్ ఛేంజరా? కాదా అనే విషయం బండి సంజయ్‌కు తెలియాలనీ హితవు చెప్పారు. రేవంత్‌రెడ్డి పిసిసి అధ్యక్షుడుగా,బండి సంజయ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా ఉంటే బండి సంజయ్ చేయలేని పని రేవంత్ రెడ్డి చేసి చూపించారనీ అన్నారు. రేవంత్ రెడ్డి టిపిసిసి అధ్యక్షుడుగా బిఆర్ఎస్ పార్టీని రాష్ట్రంలో గద్దె దించారనీ చెప్పారు.అది గేమ్ ఛేంజర్ అంటే అని అన్నారు. రేవంత్ రెడ్డి స్టార్ క్యాంపైనర్‌గా కేరళలో మాత్రమే ప్రచారం చేశారు.మిగిలిన అస్సాం,వెస్ట్ బెంగాల్,పుదుచ్చేరి,తమిళనాడు వెళ్ళలేదనీ అన్నారు. సెప్టెంబర్1వ తేదీ 2025న కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందనీ, ఇప్పటి వరకు సిబిఐ విచారణ ఎందుకు స్టార్ట్ చేయలేదు బండి సంజయ్‌వివరణ ఇవ్వాలనికోరారు. సిబిఐకు అప్పగిస్తే 48 గంటల్లో తాడో పేడో తెలుస్తామని కిషన్ రెడ్డి అన్నారు ఏమైంది? అని అడిగారు. మోడీ తెలంగాణ పర్యటనకు వచ్చే 10వ తేదీలోగా తెలంగాణలో బిఆర్ఎస్ అవినీతిపై సిబిఐ విచారణ మొదలుపెట్టి మీ చిత్తశుద్దిని నిరూపించుకోండనీ సవాల్ విసిరారు.

